ఇద్దరూ ఆ రోజు అలా పలకరించడంతో అతడికి మతి పోయింది. అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి. వాసు, కుసుమల కళ్ళల్లో మొన్నెవరో అమ్ముతామన్న ఊరి చివరన వున్న ద్రాక్షతోట కళ్ళల్లో కలిసి మెరిసింది!

దగ్గరుండి వాసు, కుసుమలు సుబ్బారావుగారిని కలకత్తా తీసుకొచ్చారు, కానీ ఖర్చు పెట్టనీయకుండా! రాజు, సౌమ్యలు పువ్వుల్లో పెట్టి సుభద్రమ్మను కలకత్తా తీసుకెళ్ళారు!

"సుభద్రా! ఏమో అనుకున్నాం గానీ, మన పిల్లలెంత మంచివాళ్ళే! వాళ్ళిద్దరూ నన్నూ, వీళ్ళిద్దరూ నిన్నూ ఎంత జాగ్రత్తగా తీసుకొచ్చారో ఇక్కడికి! నాకు చాలా సంతోషంగా వుంది. నువ్వు ప్రైజు తీసుకుంటూ వుంటే స్వయంగా దగ్గరుండి చూడాలనిపించి రాగలనో లేదోనని భయపడిపోయాను పిల్లల్ని డబ్బులడగడమెందుకని నా ఉంగరాన్ని అమ్మేశాను అయిదు వేలొచ్చాయి. ఇదుగో, ఇవి నీ దగ్గరుంచు. ఏ నాడు ఇంత మొత్తాన్ని నీకివ్వలేకపోయాను. కొద్దో గొప్పో యిచ్చినా అది పిల్లల కోసమే ఖర్చు పెట్టేదానివి. కాని నీకోసమంటూ ఏమీ చేసుకోలేదు. అన్నట్టు నీ చెవుల దుద్దులూ ముక్కు పుడకా ఏవీ?" బోసి నోటితో సుభద్రమ్మను ముద్దు పెట్టుకుంటూ అన్నారు సుబ్బారావు గారు. సుభద్రమ్మ సిగ్గుపడిపోతూ అతని కౌగిట్లో కుంచించుకుపోయింది.

''రాజునీ. సౌమ్యనీ ఇబ్బంది పెట్టడమెందుకని మన రామకృష్ణ ద్వారా అవి అమ్మేశానండి. రెండూ కలిపి పదివేలొచ్చాయి. ఇప్పుడు మనిద్దరి దగ్గరా మొత్తం పదిహేనువేలున్నాయి. బహుమతి డబ్బు యిరవై వేలు. ముప్పై అయిదు వేలూ బ్యాంకులో వేస్తే....'' ఏదో చెప్పబోయేలోపల కొడుకులూ, కోడళ్ళూ రావడంతో చెప్పడం ఆపేసి వారందరికేసి ఆప్యాయంగా చూసింది.

''ఎన్నాళ్ళకి కుటుంబం అంతా ఒక్కచోట ఉందండీ! ఈ సంతోషం నేను పట్టలేపోతున్నాను'" అంది సుభద్రమ్మ భర్త వంక చూస్తూ.

"అవును సుభద్రా! నాకూ అలాగే వుంది. ఈ కాలం ఇలాగే నిలిచిపోతే- అందరూ ఇలాగే కలిసి వుండిపోమూ? ఒరేయ్ పెద్దాడా! నువ్వెలాగూ డాక్టర్వి కదరా! ఈ ప్రాక్టీ సేదో రాజమండ్రిలోనే పెట్టుకోకూడదూ? నువ్వూ, చిన్నాడూ అందరం కలిపి పెద్ద ఇల్లు తీసుకుని వుందాం. చిన్న వాడికి ఇప్పుడు రాజమండ్రి నుంచి ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం లేదు కదా!'' అన్నారు సుబ్బారావుగారు.

